ఈపీటీఆర్‌ఐని ఆధునీకరించండి

ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ–శిక్షణ సంస్థ (ఈపీటీఆర్‌ఐ)ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐ సంస్థను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రాముఖ్యత కోల్పోయిన ఈపీటీఆర్‌ఐ సంస్థని తిరిగి గాడిలో పెట్టాలని కోరారు. సంస్థలో నెలకొన్న సమస్యలను గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని సంస్థ డైరెక్టర్ జనరల్ అహమద్ నదీంను ఆదేశించారు.

రోడ్ల మరమ్మతుపై దృష్టిపెట్టండి

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): వానకాలంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుపై దృష్టి పెట్టాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు, హ్యామ్ రోడ్ల ఎంపికపై ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఏర్పడ్డ గుంతల పూడ్చివేతను వెంటనే చేపట్టాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు.

'బంజారా' ఉద్యోగులకు నేడు సెలవు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): బంజారా వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు శనివారం ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు.

సీమ్యాట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. విద్యార్థుల ర్యాంకు కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. సీమ్యాట్ పరీక్షను జనవరి 25న ఆన్‌లైన్‌లో నిర్వహించగా, 74,012 మంది విద్యార్థులకు 63,145 (85.32%) మంది హాజరయ్యారు.

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం

నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. ఎన్నిక ప్రక్రియ లేదా ఎన్నికపైన ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలని జస్టిస్ టీ వినోద్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. కరీంనగర్ ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగనున్న ఎన్నికల్లో తన నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లికి చెందిన శ్రీహరి వేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది.

ఏనుగుల బీభత్సం ముగ్గురి దుర్మరణం

- 30 మందికి గాయాలు
- కేరళ ఆలయం వద్ద బాణసంచా కాల్చడంతో తొక్కిసలాట

కొజికోడ్ : కేరళలోని కొజిక్కోడ్‌లో మనకులంగర దేవాలయం వద్ద గురువారం జరిగిన ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో దేవాలయం అధికారులు, భక్తులు బాణసంచా కాల్చడంతో రెండు ఏనుగులు భయంతో పరుగులు తీశాయి. ఇవి మొదట ఒకదానిని మరొకటి ఢీకొట్టుకుని, సమీపంలోని భవనం గోడను ఢీకొట్టాయి. దీంతో ఆ గోడ కూలిపోయింది. దాని కింద నలిగిపోయి ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో భక్తులు కూడా ఆందోళనతో పరుగులు తీయడంతో తొక్కిసలాట జరగడంతో 30మంది గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సంతాపం తెలిపారు.

దళిత జవాన్‌పై దాడి బాధాకరం

ఉప ముఖ్యమంత్రి భట్టి రాజీనామా చేయాలి • బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

చింతకాని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

మధిర, ఫిబ్రవరి 14 : ఎస్సీ నియోజకవర్గమైన మధిరలో దళిత జవాన్‌పై అగ్రకులాల వారు దాడికి పాల్పడటం బాధాకరమని బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మధిర నియోజకవర్గంలోని చింతకాని పోలీస్‌స్టేషన్ ఎదుట బీఎస్పీ నాయకులు బాధితులతో కలిసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నాడు రేపల్లెవాడకు చెందిన మరియమ్మను ఇదే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి హతమార్చిన ఘటన మరిచిపోకముందే మళ్లీ ఇదే పోలీస్‌స్టేషన్‌లో దళిత జవాన్ మనోజ్‌పై అగ్రవర్ణ కులాలు అక్రమంగా కేసులు పెట్టడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనకు బాధ్యతవహించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దళిత జవాన్‌పై దాడిలో నిందితుల అరెస్టు

ఖమ్మం జిల్లా బోనకల్లు గ్రామానికి చెందిన దళిత జవాన్ బూదాల మనోజ్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వైరా ఏసీపీ రెహమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతకాని మండలం నాగులవంచలోని పెట్రోల్‌బంక్‌లో ఇటీవల జరిగిన గొడవకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఈనెల 11న చింతకాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మనోజ్‌పై గోవిందాపురం–ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేశ్, చింతకానికి చెందిన లగడపాటి సాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే దాడి చేశారని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మనోజ్ ఫిర్యాదు మేరకు రమేశ్, సాయిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని పోలీసులు నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నట్టు తెలిపారు.

దళిత జవాన్‌పై దాడి దుర్మార్గం: ఎర్రోళ్ల

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులు అధికార మదంతో దళిత జవాన్‌పై దాడి చేయడం దుర్మార్గమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఖండించారు. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మదిర నియోజకవర్గంలో ఈ ఘటన జరగడం బాధాకరమని అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మినేని రమేశ్, లగడపాటి సాయి గూండాయిజం చేస్తూ దాడులకు తెగబడుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజాపాలన ముసుగులో కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సుల్లోనూ 'ఏఐ'

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లోనూ ఎమర్జింగ్ కోర్సులను మిళితం చేయాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. ఎమర్జింగ్ కోర్సులైన ఏఐ, ఎంఎల్, డాటా సైన్స్ వంటి కోర్సులను కోర్‌కోర్సుల్లో అంతర్భాగం చేయనుంది. వీటిలో కొన్నింటిని తప్పనిసరి చేయనుండగా, మరికొన్నింటిని ఎలక్టివ్, యాడ్ ఆన్ కోర్సులుగా అందుబాటులోకి తీసుకొస్తారు. అయితే తప్పనిసరి కోర్సులను 160 క్రెడిట్స్‌లో క్లెయిమ్ చేసుకునే అవకాశముండగా, యాడ్‌ఆన్, ఎలక్టివ్ కోర్సులను క్లెయిమ్ చేసుకునే అవకాశంలేదు. ఇంటర్ డిసిప్లినరీ విధానాన్ని సైతం అనుసరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఉన్నతవిద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ చైర్మన్‌గా, ఓయూ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ క్రిష్ణయ్య, జేఎన్టీయూ ఎలక్ట్రికల్ విభాగం ఆచార్యుడు ప్రొఫెసర్ భాస్కర్, సీసీఐ మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, డాటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (నాస్కామ్) సీఈవో డాక్టర్ శ్రీరామ్‌తో కూడిన కమిటీని నియమించారు. త్వరలోనే భేటీ అయ్యి సిలబస్‌ను ఖరారుచేయనుంది.

అమరుల త్యాగఫలమే ఎస్సీ వర్గీకరణ

- మాదిగ అమరుల దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించాలి
- అమరుల త్యాగాలపై మాట్లాడే అర్హత మంద కృష్ణకు లేదు
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 : అమరుల త్యాగఫలమే ఎస్సీ వర్గీకరణకు అమోదమని, అమరుల కుటుంబాలను ఆదుకున్నప్పుడే వారి త్యాగాలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ అమరుల కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాదిగ అమరుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం, ఇందిరమ్మ ఇంటితోపాటు రూ.50 లక్షలు ప్రకటించి అండగా నిలువాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదం తెలిపినా మంద కృష్ణమాదిగ అమరుల కుటుంబాలను పరామర్శించకపోవడంపై జాతి ఆయనను క్షమించదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన దండోరా ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులపై పెట్టిన కేసులను తక్షణమే కొట్టివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదిగ అమరుల స్మారక స్థూపం ఏర్పాటుకు హైదరాబాద్ నడిబొడ్డున ఎకరం స్థలం కేటాయించి స్మారక మ్యూజియం నెలకొల్పాలని కోరారు. మార్చి 1న అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి మాదిగ అమరుల సంస్మరణ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. అమరుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పొన్నాల సురేందర్ తల్లిదండ్రులు పొన్నాల యాదయ్య, గంగమ్మ, మహేశ్ తల్లిదండ్రులు అంజయ్య, బంగారు శ్రీను, సంఘం నాయకులు పొట్టపెంజర రమేశ్, కృష్ణ, శాంతికిరణ్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్‌బోర్డులో సీసీసీ

సీసీ కెమెరాలతో పరీక్షల మానిటరింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలోని ఓ కాలేజీలో పరీక్షలు ఎలా జరుగుతున్నాయి. ఏవైనా తప్పిదాలు జరుగుతున్నాయా..? పేపర్ లీకేజీ వంటివి జరుగుతున్నాయా..? అని తెలియాలంటే ఇది వరకు అధికారులు ప్రత్యక్షంగా వెళ్లాల్సి వచ్చేది. ఆకస్మిక తనిఖీలు జరపాల్సి వచ్చేది. కానిప్పుడు ఒకే ఒక్క క్లిక్‌తో పరీక్ష ఎలా జరుగుతుందన్నది ఇట్టే తెలిసిపోతుంది. అనుమానాస్పద వ్యక్తులను వెంటనే గుర్తించవచ్చు. ఇలాంటి అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను ఇంటర్‌బోర్డు అందుబాటులోకి తీసుకొచ్చింది. పరీక్షల సంస్కరణల్లో భాగంగా ఈ సెంటర్‌ను నాంపల్లిలోని బోర్డులో ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గల ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడాలేకుండా అన్ని కాలేజీల్లో ఇప్పటికే 8వేల సీసీ కెమెరాలు బిగించారు. ప్రస్తుతం ప్రాక్టికల్స్ నేపథ్యంలో ల్యాబుల్లో వీటిని ఏర్పాటు చేశారు. మార్చి 5 నుంచి జరిగే థియరీ పరీక్షల పర్యవేక్షణకు మెయిన్‌గేట్, కారిడార్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులుండే చోట వీటిని బిగించారు. వీటిని సీసీసీతో అనుసంధానించి, ఒకేసారి అన్ని సీసీ కెమెరాలు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సీసీసీని విద్యాకమిషన్ సందర్శించింది.

వెంచర్ యజమానుల నుంచి 2 లక్షలు లంచం

- ఏసీబీకి చిక్కిన డీపీవో, పంచాయతీ కార్యదర్శి

ఏసీబీకి పట్టుబడిన డీపీవో శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 14 : ఓ వెంచర్ యజమానుల నుంచి రెండు లక్షలు లంచం తీసుకుంటూ జిల్లా పంచాయతీ అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ కథనం ప్రకారం.. ఉండవల్లి మండలం పుల్లూరు శివారులోని హైవే పక్కనే అన్నపూర్ణ గ్రీన్‌హిల్స్ వెంచర్‌లో గ్రామ పంచాయతీకి తనఖా పెట్టిన ప్లాట్లను అనుమతుల్లేకుండా సబ్‌రిజిస్ట్రార్ అధికారుల సహకారంతో వెంచర్ యజమానులు ఓ బిల్డర్‌కు రిజిస్టర్ చేసినట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో డీపీవో శ్యాంసుందర్.. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి చేత వెంచర్ యజమానులకు నోటీసులు ఇప్పించాడు. తర్వాత వెంచర్ యజమానులు కార్యదర్శిని ఆశ్రయించగా.. రూ.3 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు డీపీవోకు రూ.1.50 లక్షలు, కార్యదర్శికి రూ.50 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. శుక్రవారం ఉండవల్లి మండలం బూడిదపాడు శివారులో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వెంచర్ యజమానులు డబ్బులు అందించగా.. కార్యదర్శి వెంటనే డీపీవోకు సమాచారం చేరవేశాడు. ఏసీబీ అధికారులు కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే డీపీవోను కూడా అదుపులోకి తీసుకొన్నారు. జిల్లా పంచాయతీ శాఖ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. శ్యాంసుందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

యాదాద్రి పవర్ ప్లాంటులో ప్రమాదం

కాలిన బూడిద పడి ఆరుగురు కార్మికులకు తీవ్రగాయాలు

దామరచర్ల, ఫిబ్రవరి 14 : నల్లగొండ జిల్లాలోని యాదాద్రి పవర్ ప్లాంటులో శుక్రవారం ప్రమాదం జరిగింది. యాష్ ప్లాంట్ ఈఎస్‌పీ వద్ద కాలిన బూడిద పడి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్లాంటులోని రెండో యూనిట్ నుంచి ప్రస్తుతం 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న క్రమంలో ఈఎస్‌పీ వద్ద యాష్ జామ్ కావడంతో ట్రిప్ అయ్యి బాయిలర్ నిలిచిపోయింది. జామ్ అయిన యాష్‌ను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా వేడి బూడిద మీద పడి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అంబులెన్సులో మిర్యాలగూడకు ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో దవాఖానకు తీసుకెళ్లారు.

భూమి సర్వేకు 12 వేలు లంచం

ఏసీబీకి చిక్కిన మర్రిగూడ సర్వేయర్

మర్రిగూడ, ఫిబ్రవరి 14 : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం సరంపేటకు చెందిన రైతు సర్వే నంబర్ 366లోని వ్యవసాయ భూమికి కొలతలు వేయాలని సర్వేయర్ లావుడ్యా రవినాయక్‌ను కోరారు. రవి లంచం డిమాండ్ చే యగా, 12 వేలకు ఒప్పందం కుదిరింది. శు క్రవారం తహసీల్ కార్యాలయంలోని రికార్డు గదిలో సర్వేయర్ రవినాయక్ రైతు నుంచి 12 వేలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సర్వేయర్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు 50 వేల లంచం

ఏసీబీ వలకు చిక్కిన గచ్చిబౌలి ఏడీఈ

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణాణ): విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసే క్రమంలో లంచం డిమాండ్ చేసిన ఓ అవినీతి అధికారిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గోపనపల్లి సాయినగర్ హౌసింగ్ కాలనీలో అపార్ట్‌మెంట్ నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ కావాలని ఓ వినియోగదారుడు విద్యుత్తు శాఖకు దరఖాస్తు చేసుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలంటే లక్ష రూపాయల ఇవ్వాలని గచ్చిబౌలి ఏడీఈ కొట్టే సతీశ్ సదరు వినియోగదారుడిని లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఫిబ్రవరి 6వ తేదీన రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు కలిపి రూ. 75000 ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా ఈనెల 7న అడ్వాన్స్ రూపంలో రూ. 25 వేలు ఏడీఈ సతీశ్‌కు ఇచ్చాడు. మిగతా రూ. 50 వేలను శుక్రవారం అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఏడీఈ సతీశ్‌కు ఇస్తుండగా, అప్పటికే అక్కడ మాటువేసిన ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ బృందం ఏడీఈని సతీశ్‌ను రెడ్‌హ్యాండెట్‌గా పట్టుకున్నారు. అధికారుల దగ్గరికి వెళ్లినప్పుడు అధికారులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్లు సంప్రదించాలని ఏసీబీ అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్ తెలంగాణ ఏసీబీ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి

- ఆక్రమణదారులకు అండగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ
- మీడియా సమావేశంలో ఐలాపూర్‌వాసుల గోడు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : నాలుగు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూములను కొందరు ఆక్రమించుకున్నారని ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సందీప్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో సర్వే నంబర్లు 119 నుంచి 220 వరకు 408 ఎకరాల స్థలం ఉందని, 1984 నుంచి 1989 వరకు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థల్లో పనిచేసిన ఉద్యోగులు 3 వేల మందికి పైగా 200, 300, 500 గజాల చొప్పున కొనుగోలు చేసినట్టు తెలిపారు. 1994లో ఓ వ్యక్తి గ్రామస్తులను తీసుకొచ్చి ప్లాట్ల కబ్జాకు తెర లేపాడని, దీంతో కోర్టును ఆశ్రయించగా 1997లో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినట్టు చెప్పారు. తిరిగి అప్పటి జాయింట్ కలెక్టర్‌పై ఒత్తిడిపెట్టి లావణి పట్టాగా చూపించే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. దీంతో మరోసారి కోర్టును ఆశ్రయించగా.. 2012లో ఆ ప్లాట్లన్నీ కొనుగోలు చేసి పట్టాలు పొందిన వారికే చెందుతాయని ఆర్డర్ వచ్చిందని చెప్పారు. ఆ ఆర్డర్‌ను బేఖాతరు చేస్తూ మళ్లీ తమ ప్లాట్లను కబ్జా చేయడమే కాకుండా 2021లో 700 ఇండ్లు నిర్మించి విక్రయించాడని, తమ ప్లాట్ల వద్దకు వెళ్తే రౌడీలను పెట్టి దాడులు చేయించారని ఆరోపించారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, ఓ మాజీ ఎమ్మెల్సీ అండదండలు ఉన్నట్టు ఆరోపించారు. కబ్జాదారుతో 3 వేల కుటుంబాలకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో రవికాంత్‌రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూమిని కాజేయాలని చూస్తున్నరు'

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : భూమి రాసివ్వనందుకు తమపై కొందరు కక్షగట్టి తప్పుడు కేసులతో జైలుపాలు చేశారని బాధిత రైతు దంపతులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్‌లో ఆరు ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. పీడీఎస్ బియ్యం బ్లాక్‌మార్కెట్ దందా చేసే స్థానిక వ్యక్తి తమ భూమి నుంచి ఎకరం పట్టా చేయాలని వేధిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై సీఐకి తొమ్మిదిసార్లు, డీఎస్పీకి రెండుసార్లు, ఎస్పీకి పది, ఐజీకి ఒకసారి, డీజీపీకి నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. చివరకు జిల్లా మంత్రిని కలిసి అధికారుల్లో ఎలాంటి చలనం లేదన్నారు. తనకు జరిగిన అన్యాయంతోపాటు అధికారులు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 21న ఇందిపార్కు వద్ద ధర్నా చేస్తామని తెలిపారు.

జీసీసీ హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలి

జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు యూనియన్ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ గోదాములలో పని చేస్తున్న తెలంగాణ గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) హమాలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనాలు కల్పించడం లేదని తెలంగాణ సివిల్ సప్లైయ్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలుగా ఎంతోకాలంగా పనిచేస్తున్న ఇప్పటి వరకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సివిల్ సప్లైయ్ హమాలీల మాదిరిగానే తమకు కూడా పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబాలకు ఏ సహాయం అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఏ శరత్‌కు వినతి పత్రం అందచేశామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు వంగూరు రాములు, బుస్సా మొగిలి, బోగి సత్యం, సుబ్రహ్మణ్యం, కాటబోయిన శ్రీను తదితరులు తెలిపారు.

జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్, జస్టిస్ సుజనతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

శాశ్వత న్యాయమూర్తులుగా ముగ్గురి ప్రమాణం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ సుజన శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వారి తో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ ప్రమాణం చేయించారు. 2023 జూలై 31న అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టిన ఈ ముగ్గురిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రపతి జారీచేసిన నియామక ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ ఎస్ గోవర్ధన్‌రెడ్డి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తు లు, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జీ ప్రవీణ్‌కుమార్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఫోన్లట్యాపింగ్ కేసులో ప్రణీత్‌రావుకు బెయిల్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఫోన్లట్యాపింగ్ కేసులో రెండో ముద్దాయి ప్రణీత్‌రావుకు ఒకటో అదనపు జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష చొప్పున ఇద్దరి జామీనులను కోర్టుకు సమర్పించాలని, పాస్‌పోర్టును జమ చేయాలని పేర్కొంది. విచారణాధికారికి సహకరించాలని, సాక్షులను–సాక్ష్యాధారాల్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించరాదని షరతులు విధించింది. ఏడాదిపాటు ప్రణీత్‌రావు రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ కేసులో తిరుపతన్నకు సుప్రీంకోర్టు, భుజంగరావుతోపాటు రాధాకిషన్‌రావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు, ఐ–న్యూస్ ప్రతినిధి శ్రావణ్‌లపై నాన్ బెయిలబుల్ వారంట్ పెండింగ్ ఉంది. ఇద్దరు నిందితులు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పోలీసులు మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నిర్దిష్ట వేళల్లోనే పిలవాలి

ఫోన్‌ట్యాపింగ్ కేసులో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇతరులపై పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసులో సాక్షిని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలోనే విచారణకు పిలవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో సాక్షితోపాటు న్యాయవాదిని అనుమతించేందుకు నిరాకరించింది. పోలీసులు ఎప్పుడుపడితే అప్పుడు విచారణకు పిలుస్తున్నారంటూ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వంశీకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. న్యాయవాది ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి వాదిస్తూ, ముందస్తు సమాచారం లేకుండా సాక్షిని పోలీసులు పిలుస్తున్నారని, తీసుకెళ్లిన తర్వాత రాత్రి వరకు ఉంచుకుని వదులుతున్నారని చెప్పారు. ముందస్తు నోటీసు కూడా ఇవ్వడం లేదని అన్నారు.

రామోజీ తప్పులకు కొడుకు ఎలా బాధ్యుడు?

మార్గదర్శి కేసులో వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యవస్థాపకుడు రామోజీరావు మరణించారని, ఆయనపై అభియోగాలను కుటుంబసభ్యులకు ఆపాదించేందుకు వీల్లేదంటూ హైకోర్టులో శుక్రవారం వాదనలు జరిగాయి. రామోజీ కుటుంబసభ్యులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చెల్లవని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ హైకోర్టులో వాదించారు. తండ్రి తప్పు చేస్తే అందుకు కొడుకును శిక్షించడానికి వీల్లేదన్నారు. హిందూ అవిభాజ్య కుటుంబం కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ కార్యకలాపాలు చేపట్టినందున కర్త రామోజీరావు మాత్రమే అవకతవకలకు బాధ్యుడవుతాడని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, హెచ్‌యూఎఫ్ కింద వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోనప్పుడు ఆ తప్పులకు బాధ్యత వహించాలి కదా అని ప్రశ్నించింది.ఈ నెల 28కి విచారణ వాయిదా వేస్తూ జస్టిస్ శ్యామ్‌కోషి, జస్టిస్ సుజన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

సువర్ణభూమిపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): సువర్ణభూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ శ్రీధర్, డైరెక్టర్ దీప్తిపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో నిరుడు డిసెంబర్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. లాభాల ఆశ చూపి కస్టమర్ల నుంచి దాదాపు రూ.1.55 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. బై బ్యాక్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో దాదాపు రూ.కోటిన్నర మేర వసూలు చేసి ఏడాదిన్నర తర్వాత 25% అధికంగా చెల్లిస్తామని శ్రీధర్ చెప్పినట్టు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్కీమ్ కాలవ్యవధి దాటినా డబ్బులు చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపారు. పెట్టుబడి పేరుతో తమను మోసగించారంటూ సాఫ్ట్‌వేర్, రిటైర్డ్ ఉద్యోగులు శ్రీధర్‌పై ఫిర్యాదు చేశారు. మోసాల చిట్టా పెద్దగా ఉండటంతో ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బాధితులు సీసీఎస్‌కు వచ్చివెళ్లినట్టు తెలిసింది. ఈ కేసులో సుమారు 200 మంది కస్టమర్లు ఉంటారని, రూ.200 కోట్ల మేర మోసం జరిగినట్టు పోలీసులకు చెప్పారు.

రోడ్డుపై మంచం వేసి ఇసుక లారీల అడ్డగింత

రంగయ్యపల్లిలో గ్రామస్థుడి వినూత్న నిరసన

రంగయ్యపల్లిలో రోడ్డుపై మంచం వేసుకొని నిరసన తెలుపుతున్న కర్రె రాంచంద్రం

ముత్తారం, ఫిబ్రవరి 14: 'దుమ్ము, ధూళీ లేవకుండా రోడ్డుపై నీరు చల్లించండి మహాప్రభో.. ఇంట్లో ఉండలేకపోతున్నాం' అంటూ రోడ్డుపై మంచం వేసి పడుకొని ఓ వ్యక్తి వినూత్న నిరసన చేపట్టాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలోని రంగయ్యపల్లిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. ముత్తారం మండలం ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాల్లో తాడిచర్ల బ్లాక్–1, 2 ఇసుక క్వారీ నుంచి నిత్యం వందలాది లారీలతో ఇసుకను తరలిస్తుండటంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని రంగయ్యపల్లికి చెందిన కర్రె రాంచంద్రం ఆవేదన చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం రోడ్డుపై మంచం వేసుకొని పడుకొని ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకుని నిరసన తెలిపాడు. దుమ్ము, ధూళీ తాగే నీరు, తినే అన్నంలో పడుతున్నదని, శ్వాసకోశ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. అధికారులు స్పందించి రోడ్డుపై నీటిని చల్లించి.. ఇసుక క్వారీలను పూర్తిగా నిలిపివేయాలని కోరాడు.

బీజేపీకి నా బలమేందో చూపిస్తా

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి పార్టీపై అలకబూనారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా టీ ఉమామహేంద్రను నియమిస్తున్నట్టు గురువారం రాత్రి బీజేపీ ప్రకటించిది. దీంతో రాజాసింగ్ మనస్తాపం చెంది ఓ ఆడియోను విడుదల చేశారు. 'గోల్కొండ జిల్లా అధ్యక్ష పదవికి తాను సూచించిన పేరును పట్టించుకోలేదు. వేరే వ్యక్తికి ఇచ్చారు. పార్టీకి నా అవసరం లేదని అనుకుంటున్నా. మున్ముందు నా బలమేందో చూపిస్తా' అంటూ వీడియోలో పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. రాజాసింగ్ 14 నెలలుగా అలక వీడటం లేదని, పార్టీ, అసెంబ్లీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ పెద్దలు రాజాసింగ్‌పై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది.